*శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై!!*
*సద్గురు సాయినాథుని శరద్బాబూజీ కీ జై!!*

# గురుకృప

గురో పినతి మీ కరీ హృదయ మందిరీ యా బసా! సమస్త జగహే గురు స్వరూప చీ ఠసో మానసా!
కరో సతత సత్కృతీ మతి హిదే జగత్పావనా!



ఓ సద్గురూ! నాహృదయ మందిరంలో నిలచి ఈ సమస్త జగత్తంతా సద్గురు స్వరూపంగా భాసించేటట్లు చెయ్యి! ఎప్పుడూ జగత్కళ్యాణ కార్యాలు చెయ్యాలనే సద్బుద్ధిని ప్రసాదించు!

సంపుటి:3 సంచిక:11 త్రైమాసిక పత్రిక జూన్- 2000

## సాయివంటి దైవంబు లేడోయి లేడోయి !

ప్రజలందరి నోట సాయి నామం
పలకాలి! సర్వత్రా సాయి
రూపం రంజిల్లాలి!
ముజ్జగాలు సాయి మహిమతో
ముప్పిరి గొనాలి! సాయిపద
రవళులు మన హృదయ
కుహరంలోని నిశ్శబ్ద నిశీధిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద
వీచికల్లా సాయి జ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి! ఆ
సుజ్ఞాన సౌరభాల
ఆస్వాదనలో మన మనసులు
మత్తెక్కాలి! సాయి
ప్రేమామృతధారలు అంతటా
నిరంతరం వర్షించాలి!



సద్గురు
శ్రీ సాయినాథుని శరద్బాబూజీ

ఆ ప్రేమామృత ధారలలో
తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల
మత్తులో ఆనందంగా నర్తిస్తూ
'సాయి వంటి దైవంబు లేడోయి!
లేడోయి!!' అని అందరూ ఏక
కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం,
ఆకాంక్ష! అదొక మధుర
స్వప్నం. ఆ స్వప్న సాఫల్యం
కోసం శ్రీ సాయినాథుని
అనన్యప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించటమే మనం
చేయగలిగింది,
చెయ్యవలసింది.

## ఈ సంచికలో


| | | |
|---|---|---|
| 1. | సాయివంటి దైవంబులేడోయి!లేడోయి | |
| 2. | ఉన్నమాట - అనుకున్నమాట - | గురు బంధువులు |
| 3. | గురుపూర్ణిమ ప్రాశస్త్యం -జ్యోతిష రహస్యం | డా\|\| సాయినాథుని శరద్బాబూజీ |
| 4. | వ్రాసేకొద్దీ ఉంది చరిత్ర - రాసుల కొద్దీ వాసిగల దత్త్రము | అద్దంకి శివరాం |
| 5. | గురూజీ బడి - మరో శెవడి | సి.హెచ్.పి. శేఖర్ |
| 6. | ఆర్తిగా అడిగిన - లేదనేది లేనే లేదు | డి. జనార్ధనరావు |
| 7. | నిదర్శనాలున్నాయ్ - దర్శనాలైనాయ్ | శ్రీమతి.లతా |
| 8. | చిత్రాన్ని చూస్తేనే - చిత్తంలో మర్పు | బి. ప్రసాద్ |
| 9. | విశ్వపూజిత - దైవము | సాయినాథుని సత్సంగి |
| 10. | గురుకృప చదివాము - గురుకృపను చవిచూసాను | పి.ఇందిరా సుధాకర్ |
| 11. | WITHOUT GURUJI - WE CANT ACHIEVE | సి.హెచ్.సుష్మ |
| 12. | గురుదర్శనం నా జీవితానికి ఒక మలుపు | జి.సుధారాణి |
| 13. | సద్గురు తత్త్వానికి ఆకారం శ్రీ శరద్బాబూజీ | సాయిదాసు |
| 14. | నేనెవ్వరికి ఏమీ నేర్పించను నేర్చుకొనేలా చేస్తాను | డా\|\| యస్. సాయివరప్రసాద్ రావు |

# ఉన్నమాట - అనుకున్నమాట

ఎన్ని పండుగలు ఉన్నా సాయిపథగాములకు గురుపూర్ణిమను మించినది మరి ఒకటి లేదు. ఒకరోజు బాబా దాదాకేల్కర్ అనే భక్తుని పిలిచి మసీదులోని ఒక స్తంభాన్ని చూపుతూ "పోయి పూజాసామాగ్రి తీసుకొని వచ్చి నీ గురువుని(ఆ స్తంభాన్ని) పూజించుకో" అన్నారు. ఏనాడూ, ఏ పర్వదినాన్ని జరుపుకోమని ప్రత్యేకంగా బాబా ఆదేశించి ఉండలేదు. దాదాకేల్కర్ ను స్తంభాన్ని పూజించుకోమనిన ఆ రోజు 'గురుపూర్ణిమ' సాయి సంప్రదాయానుసారం ప్రతి సాయి పథగామికి 'గురుపూర్ణిమ' పవిత్రమైన పర్వదినము.

బాబా చెప్పిన భావగంభీరమైన సద్గురుపదవాక్యానికి భగవాన్ భాష్యం చెప్పారా అన్నట్లుగా" ఆత్మ జ్ఞానం పొందదలచినవాడికి గురువు అత్యంత ఆవశ్యకము, నీలో ద్వైత భావం ఉన్నంతవరకు, గురువు యొక్క అవసరం తప్పదు. అహంకారం మదించిన మత్తగజం వంటిది. సింహము తప్పదానిని మరొకటి లొంగదీయలేదు. గురువు సింహమువంటివాడు. సద్గురువు ఏనుగువంటి అహంకారాన్ని భయంతో వణికి మరణించేలా చేయగలడు. ఛాత్రునిలోని అహం నశింపచేయడమే నిజమైన గురు ప్రతిభ. అప్పుడే కాని, సద్గురువు మహత్తుని అతడు గుర్తించగల్గుతాడు. అట్టి స్థితి రావాలంటే గురువునకు ఆత్మ సమర్పణ చేసుకోవాలి. అప్పుడే ఛాత్రుడు ఆత్మోపదేశానికి అర్హుడని గుర్తించి గురువు అనుగ్రహిస్తాడు. అందుకే నిరంతరం సద్గురువుకి శరణాగతి చెంది, గురుపాదాలు పట్టకపోతే లేదు సద్గతి అని తెలుసుకోవాలి"

సద్గురువుని ఎన్నడూ మానవమాత్రునిగా ఎంచరాదు. సద్గురుపథాన్ని, సద్గురు వాక్యాన్ని శృతివాక్యంగా చేసుకోవాలి, మన గురూజీ తన గురువుని ఎలా సేవించారో, గురువుపై ఎంతగా ఆధారపడ్డారో, గురుసేవలో నిరంతరం ఎంతగా నిమగ్నమైనారో గమనిస్తే 'దైవం మానుషరూపేణ' అది నిజమనిపిస్తుంది. గురూజీ 'శిరిడీ' చేరిన మొదటి రోజులలో వైద్యునిగా వ్యక్తమై రోగార్తులను ఆదుకొని ధన్వంతరిలా వెలిగొందినారు. అతి నిరాడంబర జీవితాన్ని కొనసాగిస్తూ, నిరంతరం బాబా సేవలో, బాబా పనిలో, తరిస్తూ బాబ దీక్షాయజ్ఞంలో తన జీవితాన్ని పూర్ణాహుతి చేసుకొని, వచ్చిన యజ్ఞఫలాన్ని ఎందరో అర్థార్థులకు జిజ్ఞాసులకు, ముముక్షువులకు యజ్ఞప్రసాదాన్ని అందించారు. ఆధ్యాత్మికత అంటే ఆనందంగా జీవించటం అని యదార్థమైన అన్వయార్థమును వివరించినది గురూజీయే.

అట్టి మహోన్నతమైన 'సాయినాథుని శరత్ బాబూజీ'ని 'గురుపూర్ణిమ' నాడు సందర్శించి, నిజమైన సాయిబాటలో నడవవలెనన్న సాధకులకు గురూజీ చేయూత ఎంతగానో అవసరమౌతుంది. సాయి సన్నిధికి చేరవలెనను తలంపు, సాయితత్త్వాన్ని అవగతం చేసుకొని, నిరంతరం ఆనందములో తులతూగుతూ, సద్గురు సెవలో జీవితాన్ని తరింపచేసుకోవాలని ఆరాటపడేవాడికి 'శరద్బాబూజీ' ని చేరక తప్పదు. అలా చేరిన రోజే అతనికి పరిపూర్ణమైన 'గురుపూర్ణిమ'

గురుబంధువులు.

# గురుపూర్ణిమ ప్రాశస్త్యం - జ్యోతిష రహస్యం

(జూలై, 1991 - సాయిపథం నుండి)

పండుగలు పలువిధాలు, వానిలో ఆర్థిక భౌగోళిక, సామాజిక పరిస్థితుల నేపథ్యంలో కాలము రూపుదిద్దినవి కొన్ని - వివిధ ఆధ్యాత్మిక మత సంప్రదాయాలు ప్రవర్తిల్లజేసినవి మరికొన్ని - అవి ఏవి, ఎన్ని అనే మీమాంస ఇప్పుడు వద్దు. ఎందుకంటే, ఎన్నో పండుగల మూలం కాల ప్రవాహంలో మరుగున పడి వాటి ప్రాధాన్యతలు, పరిక్రియలు అటు ఇటుగా కలగా పులగమై పోయ్యాయి. అయినా, ఒక విధమున స్థూల విభజనకు పూనుకొంటే, మన పండుగలను నాలుగు వర్గాలుగా చేసి చెప్పవచ్చు. మొదటిది ఋతుసంబంధమైన ఉత్సవాలు. ఉగాది, సంక్రాంతి మొ॥నవి ఈ తరగతికి చెందినవి. రాజకీయ మత సామాజిక రంగాలలో పెద్ద సంస్కరణకు మార్పుకు కారణభూతులైన యుగపురుషులు మహాత్ములయిన వారి జన్మదినోత్సవాలు రెండవ తరగతి, శ్రీరామనవమి, శ్రీకృష్ణాష్టమి, దత్తాత్రేయ జయంతి, బుద్ధజయంతి, పరుశురామ జయంతి మొ॥నవి ఇటువంటివి. వివిధ ఆధ్యాత్మిక సాధన సంప్రదాయాలు ప్రవర్తిల్లజేసినవి మరికొన్ని మహాశివరాత్రి, ఏకాదశి, వినాయకచవితి. నవరాత్రులు మొ॥నవి ఈ కోవకు చెందినవి. వివిధ వ్రతాలు నాల్గోవర్గంలో చేర్చవచ్చు.

మూడవ వర్గం వివిధ ఆధ్యాత్మిక సాధన సంప్రదాయాలు ప్రవర్తిల్ల జేసిన పర్వదినాలు. ఎక్కువభాగం ఏదో ఒకరోజు ముఖ్యంగా నిర్ణయించాలి గనుక అలా నిర్ణయింపబడినవి కావు. వానిలో చాలా పర్వదినాలు జ్యోతిష ఖగోళ విజ్ఞానం అనే పునాదులపై మహర్షులు, సిద్ధపురుషులచే ఏర్పరచబడ్డవి. ఎన్నో జ్యోతిష్య యోగరహస్యాలతో ముడిపడి వున్న యీ పర్వదినాల అంతరార్థం ఆ రహస్యాల వెలుగులో కానీ అవగతం కావు. అవి రహస్యాలు గనుక చాలాభాగం రహస్యంగానే వుంచబడ్డాయి. ఆ రహస్యాలను గురుముఖంగా తెలుసుకొని ప్రతి మాసశివరాత్రి, పూర్ణిమ మొ॥ దినాలను సద్వినియోగం చేసుకోగలిగితే, ఆధ్యాత్మిక సాధన ఎంతో సుగమమవుతుంది. ఈ సుళువులు తెలియకుండా చేసే సాధన ప్రవాహానికి ఎదురు కష్టపడి తెడ్లు వేసుకుంటూ సాగే పడవ ప్రయాణం వంటిదయితే, జ్యోతిష యోగ రహస్యాలను అవగాహన చేసుకొని వాని సహాయంతో సాధనను అనుష్టించడం గాలివాటుకు తెరచాప ఎత్తి ప్రవాహం వాలులో చేసే నావ ప్రయాణం వంటిది - ఆధ్యాత్మిక సాధనకు అత్యంత ఉపయోగకరమైన అటువంటి పర్వదినాల్లో ముఖ్యమైనది గురుపూర్ణిమ.

గురుపూర్ణిమ ప్రాశస్త్యాన్ని అవగతం చేసుకోడానికి ఇంతకు ముందు చెప్పుకున్నట్లు - కొన్ని జ్యోతిషయోగ సంబంధమైన విషయాల అవగాహన కొంతవరకు (స్థూలంగానయినను) అవసరం. ఈ విషయాల గురించి కొంచెంగ ఇక్కడ ముచ్చటించుకొందాం.

మన మహర్షులు ఈ సకల విశ్వాన్నంతా చైతన్య స్వరూపుడైన భగవంతుని విరాట్ స్వరూపంగా దర్శించారు. ఋగ్వేదంలోని పురుషసూక్తం 'భగవద్గీత'లోని 'విశ్వరూప సందర్శనం' ఈ దర్శనానికి టూకీ వ్యాఖ్యలు. ఈ విశ్వమంతా ఆ విరాట్ పురుషుని శరీరమైతే, అందులోని వివిధ క్రియలకు సంబంధించిన అంశాలు ఆ శరీరంలోని వివిధ అంగాలు అవుతాయి. ఆయా అంశాల గురించిన విజ్ఞానాన్ని ప్రసాదించే శాస్త్రాలను కూడా మహర్షులు అందుకే వేదాంగాలన్నది. అటువంటి వేదాంగాలలో జ్యోతిష్యం కూడా ఒకటి. ఇది విరాటపురుషుని కన్నుగా చెప్పబడింది. ఈ విశ్వరహస్య దర్శనానికి జ్యోతిషం కన్ను వంటిదని వారి భావం. స్థూలమైన సృష్టిలో (Cosmos) ఏం జరుగుతున్నదో అదే సూక్ష్మంగా మనలోనూ జరుగుతూ వుంటుంది. నియమిత కాలపరిధిలో భూమి తనచుట్టూ, సూర్యుని చుట్టూ జేసే పరిభ్రమణాలు సూర్య చంద్ర గతులు, గ్రహగతులు, ఋతువులు, జీవోత్పత్తి ఇవన్నీ ఒకే క్రమంలో ఒక నియమాన్ననుసరించి జరుగుతూవున్నాయి. అదే విధంగా మనలోనూ శ్వాసప్రక్రియ, గుండెకొట్టుకోవడం, రక్తప్రసరణ, జీర్ణక్రియ, పిండోత్పత్తి మొ॥నవి ఒక నియమం ప్రకారం జరుగుతున్నాయి. బాహ్యంగా విశ్వంలోను మనలోను జరిగే ప్రక్రియలను నియమించే సూత్రాన్ని వేదం 'ఋతము' అని

అన్నది. ఇలా బాహ్యాంతరాలలో జరిగే క్రియల మధ్య సామరస్యాన్ని సాధించడమే 'ధర్మమంటే', ఇదే ఆధ్యాత్మిక సాధనకు లక్ష్యం, సాధనం కూడా. ఈ లక్ష్య సాధనకు ఉపకరించే ఉపకరణాలే వేదాంగాలు. వానిలో జ్యోతిషం ఒకటి.

మనలోనూ, బయట జగత్తులోనూ జరుగుతుండే యీ క్రియలకు ఎంత దగ్గర సంబంధముంటుందంటే, ఏళ్ళ తరబడి భూగుహల్లోను, సూర్యరశ్మి సోకని కొండ గుహల్లోనూ సాధన చేసుకుంటూ కూడా కేవలం వారి శ్వాస నడకను గమనించి ఆ రోజు ఏ తిథో, ఏ పక్షమో అది వుత్తరాయణమా, దక్షిణాయణమా అనే విషయం చెప్పవచ్చు. అలా చెప్పగల మహాత్ములూ వున్నారు.

ముక్కు యొక్క కుడి నాళంగుండా శ్వాస ఆడుతుంటే సూర్యనాడి పనిచేస్తూ వున్నదనీ, శ్వాస ఎడమ నాళం ద్వారా పనిచేస్తుంటే చంద్రనాడి పనిచేస్తున్నదని, బాహ్యంగా జరిగే సూర్యచంద్రాదుల గమనానికీ మనలో జరిగే శ్వాసక్రియకూ మనోభావాలకు విడదీయరాని సంబంధమున్నదని యోగజ్యోతిష్య శాస్త్రాలు చెబుతున్నాయి. మన శ్వాస ఒక్కో సమయంలో ఒక్క ప్రక్క నుండి మాత్రమే ఆడుతుంటుంది. ప్రతి మూడుగంటల కొకసారి శ్వాస ఎడమ నుండి కుడికో కుడి నుండి ఎడమకో మారుతుంటుంది. ఇలా మారుతుండే సమయంలో ముందు కొద్ది సేపు రెండువైపులా నడుస్తుంది. ఇది ఎవరికి వారు గమనించుకోవచ్చు. అలా ముక్కు రెండు నాళాల నుండి శ్వాస ఆడుతున్నపుడు సుషుమ్ననాడి పనిచేస్తున్నది అని చెప్తారు. ఆ సమయంలో మనసు అప్రయత్నంగా ప్రశాంతము సిరామయము అవుతుంది. అటువంటి మన స్థితిలో యోచనతో చేయవలసిన ప్రాపంచిక కార్యాలు పూనికతో చేయడం సహజంగానే కష్టమౌతుంది. మనస్సు ఎటువంటి ప్రయత్నం లేకుండా అత్యంత సహజంగా అంతర్ముఖమయ్యే ఆ కాలాన్నే సంధ్య అన్నారు. ఇలాంటి సంధ్యాకాలాలు సూర్యగతి ననుసరించి దినంలో నాలుగు సార్లు వస్తాయి. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, అర్ధరాత్రి, చాంద్రమాసం ప్రకారం అమావాస్య, పౌర్ణమి, శుక్లపక్ష అష్టమి, కృష్ణపక్ష అష్టమి ఇవి ప్రతి మాసంలో సంభవించే నాలుగు సంధ్యాకాలాలు. అదెలాగో చూద్దాం!

కృష్ణపక్షంలో చంద్రుడు సూర్యునికి దగ్గరగా జరుగుతూ అమావాస్య నాటికి భూమినుండి సమకోణంలో వుండి 'అదృశ్య'డౌతాడు. మళ్ళీ శుక్లపక్ష పాడ్యమి నుండి సూర్యునికి దూరంగా పోతాడు. యోగశాస్త్రంలో సూర్యుడు ఆత్మకు, చంద్రుడు మనసుకూ సంకేతం, సూర్యునిలా స్వయం ప్రకాశకమైనది ఆత్మ (చైతన్యం). సూర్యుని ప్రకాశం ఆధారంగా గ్రహించి చంద్రుడు ప్రకాశించినట్లే ఆత్మ యొక్క అస్తిత్వాన్ని ఆధారం చేసుకొని మనస్సు ప్రవర్తిల్లుతుంది. చంద్రునికి మనస్సుకూ గల సంబంధాన్ని యీనాటి శాస్త్రజ్ఞులు కూడా అంగీకరిస్తున్నారు. లాటిన్ భాషలో "లూనా"(Luna) అంటే చంద్రుడు. ఆ పదాన్ని ఆంగ్ల భాషలో కూడా గ్రహించబడ్డది. లూనార్ కాలండర్ అంటే చాంద్రమాస పంచాంగం. అలాగే మతిస్థిమితం లేనివారిని 'ల్యూనటిక్స్' అంటారు. "చంద్రమా మనసోజాతః" అనే పురుష సూక్తమంత్రం విరాట్పురుషుని మనస్సులోనుండి చంద్రుడు పుట్టాడని చెబుతున్నది. అమావాస్య రోజున చంద్రుడు సూర్యుని ప్రకాశంలో అదృశ్యుడవటం వలన మనోలయ ప్రధానమైన ఆధ్యాత్మిక సాధనలకు అమావాస్య ప్రాశస్త్యం. అమావాస్య రోజున మనస్సు తనబలం కోల్పోబోయే ముందు గొప్ప అలజడితో కూడిన భావోద్రేకాలు హృదయంలో చెలరేగుతాయి. అందుకనే ప్రతి అమావాస్య ముందు రోజైన చతుర్దశి మాసశివరాత్రిగా చెప్పబడ్డది. ఆ రోజున మనోవాసనల ఉధృతాన్ని జాగరూకతతో గమనిస్తూ వాటిని నిగ్రహించుకునే ప్రయత్నం చేయడమే శివరాత్రి జాగరణగా చెప్పబడింది. మనోబలాన్ని సిద్ధించుకునే సాధనలకు పౌర్ణమి అనుకూలమైంది.

మనలను కేంద్రంగా భావించుకుంటే సూర్యచంద్రుల ప్రభావం లంబము (vertical) గాగాని సమాంతరము (Horizontal) గాగానీ, ఉచ్ఛస్థితిలో వున్నప్పుడు మనమీద వుంటుంది - మిట్టమధ్యాహ్నం ఎండవేడి ఎక్కువగా వున్నట్లే. అవే సంధ్యాకాలాలు కూడా. ఈ ఉచ్ఛస్థానాలను (ఊహా చిత్రంలో రేఖాగణితం ప్రకారం

కేంద్రానికి కలిపితే శిలువ (cross) అవుతుంది. మానవ కుమారుడైన (ఏసు శిలువపై కొరతవేయబడి దైవకుమారునిగా (Son of God) పునరుద్ధానం చెందడమంటే యిదే. కాలస్వరూపమైన ఆ శిలువపై మానవుడు తన అహంకారాన్ని కొరత వేస్తే(అర్పించుకొంటే) దైవస్వరూపుడుగా పునరుద్ధానమౌతాడు. అలా సాధనకు మనోవిజయానికి, మనోలయానికి నిత్యనైమిత్తిక కర్మలకు అనుకూలమైన కాలనిర్ణయం చేయడమే జ్యోతిష్యం యొక్క ముఖ్య ప్రయోజనం. ప్రశ్నలూ, జోస్యాలు చెప్పడం ఆ జ్యోతిష్యం యొక్క అవాంతర ప్రయోజనం మాత్రమే.

## వ్రాసేకొద్దీ ఉంది చరిత్ర - రాశుల కొద్ది వాసిగల దత్తము

భాగము - II

*1. మన సుఖమే తన సుఖంగా భావించే గురూజీ :-* 1995 ఏప్రిల్ నెలలో వారణాసిలో గురూజీ దర్శనం నాకు లభించింది. గురూజీతో అలహాబాద్, గయ - ప్రయాగ, బుద్ధగయ వెళ్ళాను. తర్వాత కొంతకాలానికి నార్త్ ఇండియా, 1996లో దత్తక్షేత్రాలు గురూజీతో దర్శించుకున్నాను. ఈ అన్ని టూర్స్‌లో గురూజీ ఎప్పుడు బిడ్డ సుఖమే తల్లి ఆనందంగా భావించి సంతోషించేవారు.

*2. సకల దేవతా స్వరూపుడు సాయిబాబాగ నిదర్శనమిచ్చిన గురూజీ :-* 1995 సం|| సెప్టెంబర్, 7వ తేదీన తిరుపతి నుండి తిరుమలకు నడక దారిన నడిచాను. ఆ సమయంలో గురూజీ తిరువణ్ణామలైలో వున్నారు. గురూజీని దర్శించుకొనటానికి పర్మిషన్ రావాలని బాబాకు నమస్కరించి సాయిబాబా నామం చెప్పుకుంటూ కొండపైకి నడిచి వెళ్ళాను. గురూజీ నా కోరిక మన్నించి నాకు తిరువణ్ణామలై రావటానికి సెప్టెంబర్, 9వ తేదీన పర్మిషన్ యిచ్చి, దర్శనమిచ్చి సకల దేవతా స్వరూపమైన సాయిబాబాకు గురూజీకి బేధము లేదని అనుభవపూర్వకంగా నాకు చూపారు.

*3. కన్న ప్రేమను మరిపించే గురూజీ ప్రేమ :-* ఒకసారి గురూజీ తిరువణ్ణామలైలో నాకు ఎంతో ప్రేమతో తినటానికి కేక్ ఒకటి యిచ్చారు. నేను దానిని పక్కన వుంచగ గురూజీ "ఏం పక్కన వుంచావు" తిను అన్నారు. నేను దానిని తిన్నాను. నా చేతికి కేక్ బాబా అయింది. ఎలానా తుడుచుకోవటం అని ఆలోచిస్తున్నాను. గురూజీ వెంటనే తన మీద కప్పుకున్న ఖండువా తీసి "తుడుచుకో" అన్నారు. సాక్షాత్తు భగవత్ స్వరూపమైన గురూజీ యొక్క నిరాడంబరతను, ప్రేమానురాగాలు జీవితంలో ఎక్కడ పొందలేదు. మనకు గురూజీ అంటె ఎంత యిష్టమో, గురూజీకి మనమంటే ఎన్నో రెట్లు యిష్టం. ఎన్నోసార్లు మనలను చూడాలని కోరుకుంటారు. యిది నాకు ఎన్నోసార్లు అనుభవం.

*4. నీ భారాన్ని నాపై వుంచిన నిశ్చలంగ గమ్యస్థానాన్ని చేర్చగలనని నిదర్శనమిచ్చిన గురూజీ :-* 1995 సం|| అక్టోబరు నెలలో షుమారు 30 రోజులు షిరిడిలో వున్నాను. ఆ సమయంలో మా వ్యాపారంలో చాలా నష్టం వచ్చేలా వున్నది. అయినా నేను బాబాపై భారం వేసి షిరిడీలో వున్నాను. నేను తెనాలిలో లేనప్పటికి గురూజీ నా పనులన్నీ ఎంతో చక్కగా జరిగేలా చేసి, తప్పని సరిగా ఎక్కువ కాలం షిరిడీలో వుండేలా చేశారు. - నన్ను ఈ విధంగా ఎక్కువ రోజులు షిరిడిలో వుంచని ఎడల నాకు ఖచ్చితంగా వ్యాపారంలో నష్టం వచ్చేది. కారణం - ఈ నెల రోజులు తెనాలిలో వుంటే నేను మా వద్ద నున్న సరుకు అమ్మకము చేసివుండవలసి వచ్చేది. ఈ విధంగా గురూజీ నన్ను కాపాడారు.

*5. నిర్జీవ పదార్ధములను కూడా ఇన్సూరెన్స్‌కి మించిన గురూజీ రక్షణ :-* గత 10 సం||రాలుగా మేము మా వ్యాపారంలో యితర వూర్లకు పంపే సరుకు ప్రతి లారీ ఇన్సూరెన్స్ చేస్తూంటాము. కాని ఈ సంవత్సరం ఏప్రిల్ నెలలో నార్త్ ఇండియాకు ఒక లారీ సరుకు పంపినాము. పొరపాటున ఆ లారీకి ఇన్సూరెన్స్ కంపెనీలో

బ్యాలెన్స్ మొత్తం సరిపడలేదు. అందువలన ఆ లారీ ఇన్సూరెన్స్ చేసి వుండలేదు. దురదుష్టవశాత్తు ఆ లారీకి యాక్సిడెంట్ జరిగి డ్రైవర్, క్లీనర్ కి బాగా దెబ్బలు తగిలాయి. లారి పడిపోయి సరుకు బయటపడినది. ఇప్పటి వరకు బాబా దయవలన ఏ లారీ యాక్సిడెంట్ జరగలేదు. ఈ విషయం తెలిసిన వెంటనే గురూజీకి చెప్పుకున్నాను. గురూజీ దయవల్ల ఏమీ లాస్ రాలేదు. ఇన్ని సంవత్సరముల నుండి ఇన్సూరెన్స్ ప్రతి లారీకి చేస్తూ, పొరపాటున మరచిన ఈ లారీ యాక్సిడెంట్ అవ్వటం చాలా ఆశ్చర్యం కలిగించింది. గురూజీ అనుగ్రహం వల్ల ప్రమాదం తప్పి బాబ రక్షణ సర్వజగద్రక్ష అన్న అనుభవం ఇచ్చారు. ఈ విధంగా ఎన్నో ఎన్నెన్నో అనుభవాలు ప్రతి రోజు నేను గురూజీ అనుగ్రహంతో పొందుచు నా మందబుద్ధి వలన "వడ్డించిన పదార్ధాలు అనుభవించి, మరచిన విధంగా" ఎన్నో అనుభవాలను మరచిపోయాను.

*6. తనకు, బాబాకు భేదము లేదని అనుభవాన్ని ఇచ్చిన గురూజీ :-* ఓ సారి నేను, మద్రాస్‌లోని మైలాపూర్ మందిరానికి మొదటిసారిగ వెళ్ళాను. బాబా పాదములకు నమస్కారం చేస్తున్నప్పుడు నా తల బాబా పాదాలకు గట్టిగా తగిలింది. పాపం! బాబాకు కూడా నెప్పిపుట్టి వుంటుందని అనుకున్నాను. మద్రాస్ నుండి రాగానే షిరిడి వెళ్ళాను. ఒక రోజు షిరిడిలో గురూజీకి నీళ్ళు ఇస్తుండగా, నా తల గురూజీ తలకు తగిలింది. కరెక్ట్‌గా నాకు మద్రాస్‌లో బాబ పాదాలు ఎక్కడ తగిలినదో, అక్కడే గురూజీ తల నా తలకు తగిలినది. ఈట్రిప్‌లో షిరిడి నుండి తెనాలి బస్ లో వస్తునప్పుడు బస్‌లో గురూజీ బాబాగ మారిపోయినట్లుగ కలవచ్చి గురూజీ బాబాగ మారిపోయారని పెద్దగ అరిచాను. ఇంత అనుభవాన్ని ఇచ్చిన గురూజీకి బాబాకు ఏ మాత్రం భేదం లేదు.

*7. బిడ్డ అవసరం తల్లికే బిడ్డకన్న ఎక్కువ తెలుసన్న అనుభవాన్నిచ్చిన గురూజీ :-* ఒకసారి నేను గురూజీని ఒక టెండర్ యిప్పించమని అడిగాను. కాని ఆ టెండర్ నేను అడిగిన మొత్తం కాక చాలా చిన్న మొత్తంలో మాత్రం నాకు కన్ఫర్మ్ అయినది. నాకు చాలా అసంతృప్తిగా వుంది. గురూజీని టెండర్ మొత్తం కావాలని చాలా సార్లు అడిగాను. "బాబా ఎందుకు చేశారో చూద్దామన్నారు" కాని నేను తృప్తిగాలేను. కాని సరిగ్గా సరుకు సప్లై చేయవలసిన సమయానికి పూర్తిగా మార్కెట్లో పరిస్థితులు మారి, నేను ఆ కొద్ది టెండర్ కూడా చాలా కష్టంగా సప్లై చేయవలసి వచ్చింది. గురూజీ సర్వజ్ఞుడు కనుక నేను ఎంత అడిగినా నాకు ఆ మొత్తం టెండర్ రాలేదు. ఆ టెండర్ పూర్తిగా వచ్చిందంటే చాలా లాస్ వచ్చేది. సర్వజ్ఞుడైన గురూజీ భవిష్యత్తులో జరిగేదేమో! తెలుసుగనుక మమ్ములని ఈ విధంగా రక్షించారు

30-6-96, తెనాలి ~ అద్దంకి శివరాం

## గురూజీ బడి - మరో శేవడి

నా పేరు శేఖర్. నేను రోజూ విజయవాడ I Townలో జరిగే సత్సంగానికి వస్తుంటాను. నాకు ఒక జ్యోతిష్కుడు నీకు చదువులో బ్రేక్ పడుతుంది అని చెప్పాడు. అప్పటి నుంచి భయమేసి బాబా గారికి, గురువు గారికి, డిగ్రీ ఫైనల్ ఇయర్ పాసయ్యేటట్లు చూడమని నమస్కరించుకొనేవాణ్ణి. మొన్న జనవరి 1కి షిరిడీ వెళ్ళినప్పుడు నేను గురువుగారిని ఈ విషయం అడగలేదు.

మార్చిలో ఎగ్జామ్స్. అప్పుడు నాకు అమ్మవారు వచ్చింది. గురువుగారి దయవల్ల పరీక్షలు వ్రాసాను. పరీక్షలు వ్రాసాక ఒక రోజు సత్సంగంలో దండం పెట్టుకుంటూ బాబాగారిని, గురువుగారిని కాలేజీ ఫస్టు రావాలని కోరుకున్నాను. అలా కోరుకున్నాక నాకు షేమ్ గా అనిపించింది. పాసయ్యేటట్లు చూస్తే చాల్లే అని అప్పటి నుంచి కాలేజీ ఫస్టు కోరుకోలేదు. కాని నేను 86%తో కాలేజీ ఫస్టు వచ్చాను. ఇదంతా గురువుగారి దయవల్లే జరిగింది.

23.6.2000, విజయవాడ ~సి. హెచ్. వి. శేఖర్

## ఆర్తిగా అడిగిన - లేదనేది లేనేలేదు

నాకు గురువుగారి గురించి ఏమీ తెలియని రోజుల్లో మా యింటి ప్రక్కన ఉంటున్న నా స్నేహితులు శ్రీ కె. శ్రీనివాసరావుగారు ఒక రోజున అనగా ది. 19.1.2000న మా యింటికి వచ్చి నాతో ఇలా అన్నారు. "మా గురువుగారు ఈ రోజు విశాఖపట్నంలో ఉన్నారు. మీరందరూ వచ్చి దర్శనం చేసుకోండి" అని చెప్పి వెళ్ళారు. ఆ రోజున నేను మా పెద్దబ్బాయి మిథిలేష్ బాబుని తీసుకొని ఇద్దరం కలసి వెళ్ళి గురువుగారిని దర్శించి వచ్చాము. అయితే ఆ సమయంలో నాకు సామాన్యముగానే అన్పించింది. కాని మా అబ్బాయికి ఒళ్ళంతా ఏదోలా అనిపించిందని ఇంటికి వచ్చాక మాతో అన్నాడు. సరే అనుకుని ఏమిటో అర్థం కాలేదు మాకు ఆ రోజున.


ఆ తర్వాత మార్చి నెలలో ఒకరోజున రాత్రి మా అబ్బాయికి గురువుగారు కలలో కన్పించారు. మరియు మా ఇంటిలో భోజనం చేశారు. తర్వాత మా బాబు గురువుగారిని ఇలా అడిగాడట. "గురువుగారూ! నాకు చదువు బాగా రావాలి, నేను పాసవ్వాలి" అని దీవించమనడం, అప్పుడు గురువుగారు మా బాబుని ఉద్దేశించి నీకు చదువు బాగానే వస్తుంది. నీకు మార్కులు కూడా బాగానే వస్తాయి శ్రద్ధగా చదువు అని ఆశీర్వదించారట. ఆ తర్వాత జరిగిన Annual Examsలో మా బాబుకు 83% వచ్చి మమ్మల్ని ఆశ్చర్యవంతులని చేశాయి. ఎందుకనగా అప్పటి వరకూ మా బాబుకి దాదాపు 50% మించిరాలేదు. అలా మా బాబు ఆరవ తరగతి పాసయ్యాడు. ఈ విధంగా మేము అందరమూ గురువుగారు మహిమ గురించి మొట్టమొదటిసారిగా తెలుసుకుని చాలా సంతోషించాము.

11.6.2000, విశాఖపట్టణం ~ డి. జనార్ధనరావు.

## నిదర్శనాలున్నాయ్ - దర్శనాలైనాయ్

గురుబంధువులకు నమస్కారము. నేను వైజాగ్ సత్సంగ సభ్యురాలిని. నేను గురుకృప ద్వారా ఎందరో గురుబంధువులను గురువుగారు అనుగ్రహించిన తీరును తెలుసుకున్నాను. నాకు గురుకృపగా లభించిన ఈ అనుభవాన్ని మీతో పంచుకోవాలని అనుకుంటున్నాను. నేను నా అనుభవాన్ని గురించి చెప్పే ముందు బాబా, గురువుగారి గురించి నా అభిప్రాయము మీకు చెప్పాలి. నేను 2 సం|| నుండి సత్సంగమునకు వస్తున్నాను. కానీ, గురువుగారు, బాబా ఒక్కరే అని అభిప్రాయము లేదు. గురువుగారు బాబాను అత్యంత ప్రేమించే వ్యక్తి. మనము అలా చేయలేకపోతున్నాము. కాబట్టి గురువుగారు మహాత్ములు. బాబా నాకు సద్గురువుగా ఉన్నారు కదా. గురువుగార్ని ఎందుకు ఆశ్రయించడం అని నేను అనుకునేదాన్ని. ఇలా ఉండగానే మేము గురుబంధువులము అందరము కలసి శిరిడి వెళ్ళాము. అప్పుడు గురువుగార్ని దర్శించుకున్నాము. కానీ నాకు ఎటువంటి అనుభూతి కలుగలేదు. సాయియానలో గురుబంధువులు గురువుగారి గురించి చెబుతున్నప్పుడు మాత్రం నాకు ఆలోచన కలిగింది. వారి ద్వారా నాకు తెలిసినది గురువుగారికి, బాబాకు భేదము లేదు. గురుస్థాన్‌లో మన సమస్యలు చెప్పుకుంటే వాటికి సమాధానాలు గురువుగారు ఇచ్చేవారని చెప్పారు. నేను చివరి రోజు షిరిడిలో గురుస్థాంలో బాబాను దర్శించినపుడు బాబా, గురువుగారు ఒక్కరే అయితే ఇక్కడ నా సమస్యలు చెప్పుకుంటే గురువుగారికి చెప్పినట్లే కనుక నా సమస్యను మీకు చెప్పుకుంటున్నాను అని, గురువుగారికి, బాబాకు భేదంలేదు అనే నిదర్శనం కావాలి అని అడిగి మేము శిరిడి నుండి వచ్చిన తరువాత మా సత్సంగంలో "ఏకాహం"చేసుకున్నాము. "ఏకాహం" ఎంతో బాగా జరిగింది. మరునాడు శ్రీనివాసరావుగారు ఫోన్ చేసి గురువుగారు మనం "ఏకాహం" చేస్తున్న సమయంలోనే వైజాగ్ వచ్చారని చెప్పారు. ఋషికొండ కాటేజెస్ లో 4 గం|| సాయంత్రం దర్శనం ఇస్తారని చెప్పారు. అప్పటి నా ఆనందానికి అంతులేదు. నేనే కాదు మాసత్సంగ సభ్యులందరూ ఎంతో ఆనందంగా ఫీల్ అయ్యారు. గురువుగారు వచ్చారని తెలిసిన దగ్గర నుండి నాకు నిదర్శనం ఇవ్వమని గురువుగారిని ప్రార్థించాను. మేము సాయంత్రం 4 గం|| గురువుగారు ఉన్న కాటేజెస్ కు వెళ్ళాము. గురువుగారిని దర్శించినపుడు నేను ఎంతో ఆనందాన్ని

పొందాను. మళ్ళీ గురువుగార్ని చూడాలి అనే కోరిక కలిగింది. ఏమైనా సరే నాకు గురువుగారు మళ్ళీ కనిపించాలి అనుకున్నాను. నాకు ఏమీ నిదర్శనం ఇవ్వలేదని కూడా అనుకున్నాను. కానీ అప్పటికే గురువుగారు నాకు రెండు నిదర్శనాలు ఇచ్చారు. ఒకటి బాబా నామం చెప్పగానే గురువుగారు వైజాగ్ రావడం. రెండవది ఆయన మేము దర్శించినపుడు ఆయన బాబాలాగే కూర్చుని ఉన్నారు. (ద్వారకామాయిలోని రాతి దగ్గర ఉన్న బాబాలాగా కూర్చుని ఉన్నారు) అది అందరూ గమనించారు. నేను ఎంతో అవివేకంతో ఉన్నానని అనిపించింది. గురువుగారు బయలుదేరడానికి రెడీ అవుతున్నారు. గురుభందువులు అందరూ మెట్ల వైపు వెళ్ళి గురువుగారి కోసం ఎదురు చూస్తున్నారు. నేను, ఇంకొక గురుభందువు రాధగారు గురువుగారు ఉన్న గది వైపు వెళ్ళాము. అప్పుడే గురువుగారు కుర్చీ మీద నుండి లేచి గురుభందువులు ఆయన పాదాల మీద ఉంచిన పువ్వులను ఎంతో సున్నితంగా దాటుకుని ఇవతలకు వస్తున్నారు. మమ్మల్ని చూడగానే నవ్వి, బాబాలాగా ఆయన అభయహస్తాన్ని మాకు చూపి ఆశీర్వదించారు. కనీసం నమస్కారము చేసినట్లు కూడా గుర్తులేదు. గురువుగారు నవ్వుతూ ముందుకు వెళ్ళిపోయారు. మేము గురువుగారి పాదాల దగ్గర పూలు అడిగాము. S.V.L. నారాయణరావుగారు ఇచ్చారు. అవి తీసుకుని ఎంతో ఆనందంగా మెట్ల వైపు వచ్చి మళ్ళీ గురువుగార్ని కారులో ఎక్కేవరకు దర్శించుకోగలిగాము. నేను అవివేకంతో ఆయన నాకు కలిగించిన రెండు నిదర్శనాలు గుర్తించలేకపోయాను. అయినా గురువుగారు ఎంతో ప్రేమతో నా అవివేకాన్ని మన్నించి నాకు ఇష్టమైన, నేను అర్థంచేసుకునే విధంగా దర్శనం ఇచ్చి, నాకు నిదర్శనం ఇచ్చారు. ఆ రోజునుండి గురుగుగారినే బాబాగా భావిస్తున్నాను. గురువు నాకు ఉన్నారు అనే ధైర్యము నాలో ఎంతో మార్పును కలిగించింది. ఈ 5 నెలలు కాలంలో నేను అది గమనించాను. ఇంతటి అనుభవాన్ని ఇచ్చిన గురువుగారికి పాద నమస్కారములు తెలియజేసుకుంటున్నాను. ఇంక ముందు ముందు ఆయన నాకు మరిన్ని అనుభవాలను ఇస్తారని ఆశిస్తున్నాను. నేను సత్సంగం నుండి తెలుసుకున్నది. మనకు గురువుగారు ఇచ్చిన అనుభవాన్ని అంటిపెట్టుకుని ఉండాలి అనే విషయం. గురువుగారి ఇచ్చిన అనుభవాన్ని ఇలా అందరితో పంచుకోవడం, గుర్తుచేసుకోవడం ఆయన ఇచ్చిన ప్రతి అనుభవాన్ని గుర్తించగలుగుతామని భావిస్తూ గురుకృపకు ఈ లెటర్ వ్రాస్తున్నాను.



11.6.2000, విశాఖపట్టణం ~ శ్రీమతి లత

## స్పందన - ప్రతిస్పందన

మార్చి నెల గురుకృపలో మేము కోరిన ప్రకారము బాబా పలుకులైన "బ్రాహ్మణ - మసీదు - సద్బ్రాహ్మణుడు - అల్లా మాలిక్ హై అనె ఈ వాక్యాలపైన రచనలు సాగిస్తారని ఆశించాము. మాకు వచ్చిన రచనలు పరిశీలించిన తరువాత ఆ రచనలు మమ్ములను ఎంతో ఆనందింపచేసినవి.

బాబా చెప్పిన ప్రతి మాట ఒక శృతి వాఖ్యంగా చేసుకొని ఇలా ఆచరించే వారినే మన గురూజీ కోరుకొనేది. ఇలా ఆచరించి చూపటమే నిజమైన శరణాగతి "గురుకృప"

## చిత్రాన్ని చూస్తేనే - చిత్తంలో మార్పు

*స్పందన-ప్రతిస్పందన -1*

నా పేరు బి. ప్రసాద్, నేను తెనాలి షరాఫ్ బజార్‌లో బట్టల షాపులో పనిచేస్తుంటాను. మా షాపుకు ఎదురు షాపు బోర్డుపై బాబా చిత్రం వున్నది. అది మా షాపులో నేను కూర్చునే స్థానానికి సరిగ్గా ఎదురుగా వుంటుంది. నేను షాపులో ఏ పని చేసినా, బేరం చూపించినా మొదట బాబాని చూచి నమస్కరించుకొనడం అలవాటు చేసుకున్నాను. ఒక్కొక్కసారి కష్టమర్సు విసిగించినా, వాళ్ళు నాపై కోపగించినా, నేను బాబావైపు చూస్తాను.

నీవు ఓర్పుగా వుండు అని సూచిస్తున్నట్లుంటుంది. ఎవరి పైనన్నా కోపం వచ్చినా కోపాన్ని తగ్గించుకోమన్నట్లు యజమానులను నొప్పించకు అన్నట్లు, ఒకోసారి బాబా నాపై కోపంతో చూచినట్లనిపిస్తుంది. నేను ఎప్పటికప్పుడు నేను ఈ తప్పుచేస్తున్నట్లు గుర్తించి, నా తప్పు సరిదిద్దుకో గల్గుతున్నాను. ఎదుటివారు నా మనసుకి అనుగుణంగా ప్రవర్తించకపోతే వారిపై నాకు చాలా ద్వేషం కల్గేది. బాబా నాలో ఆ భావనని పూర్తిగా త్రుంచివేశారు. నా చిత్రానికి, నాకు భేదం లేదని బాబా చెప్పిన విధంగా రోజులో సాధ్యమైనంత ఎక్కువ సమయం బాబాని చూస్తు, పాటలు పాడుకుంటూ నామం చెప్పుకుంటూ, నా ఆర్థిక బాధల్ని మర్చిపోతు నన్ను వేధించే ఆలోచనలు నెట్టివేస్తు చాలా మనశ్శాంతి పొందుతున్నాను. ఈ సద్బ్రాహ్మణుడు నిన్ను శుభ్రమార్గాన నడిపిస్తు చివరికంట గమ్యం చేరుస్తాడు అన్నది బాబా మాట. నా తప్పు నేను గమనిస్తు దానిని గురువుగారు బాబా కృపతో సరిదిద్దుకుంటూ మంచి ప్రవర్తనతో ఉండటమే శుభ్రమైన మార్గంగా భావిస్తున్నాను. గురూజీ, బాబా దయతో నేను సాధ్యమైనంత వరకు బాబా కార్యక్రమాల్లో పాల్గొనేలా దీవించమని బాబాని, గురువుగారిని ప్రార్థిస్తున్నాను.

20.5.2000, తెనాలి. ~ బి. ప్రసాద్.

## విశ్వపూజిత దైవము

*స్పందన - ప్రతిస్పందన -II*

ఇది బ్రాహ్మణ మశీదు. ఈ సద్బ్రాహ్మణుడు లక్షలాది మందిని శుభ్రమార్గాన నడిపించి చివరంటా గమ్యం చేరుస్తాడు. అల్లా మాలిక్హై - *శ్రీ సాయిబాబా*

"This is a Brahmin, a white Brahmin, a pure Brahmin. This Brahmin will lead lakhs of people to the SubraMarga and take them to the goal - right upto the end"

| | |
|---|---|
| *బ్రాహ్మణుడు* | : బ్రహ్మజ్ఞానము కలిగినవాడు. |
| *సద్బ్రాహ్మణుడు* | : పరిశుద్ధమైన మనసు కలిగిన బ్రహ్మజ్ఞాని. |
| *శుభ్రమార్గము* | : గురువు నిర్దేశించిన లోటుపాటులు లేని మంచి మార్గము. |
| *చివరకంటా గమ్యము* | : బాబా లెక్కల్లో మనల్ని చేర్చవలసిన చివరి స్థాయి. |

*సారాంశము :*

తాను నిర్దేశించిన మంచి మార్గములో పరిశుద్ధుడైన ఈ బ్రహ్మజ్ఞాని లక్షలాది మందిని చివరంటా గమ్యం చేరుస్తాడు.

*సాయి సంప్రదాయానికి మచ్చుతునక :*

ప్రపంచ ఆధ్యాత్మిక చరిత్రలోనే సాయిసంప్రదాయము చాలా విశిష్టమైనది. అన్ని మతాలవారు తమదిగా భావించే, ఏ మతానికి చెందని సాయిసంప్రదాయము అనితర సాధ్యము. అర్థము లేని ఆచారకాండను, వ్యర్థమైన ఉపవాస తపవాసాలను నిరసించి బాబా అసలయిన, ఆధ్యాత్మికతను మనకు తెలియజెప్పారు. "దైవము ఒక్కడే" అన్న విషయాన్ని మనకు ఎన్నో రీతుల బోధపరచారు.

పై స్పందన వాక్యములో ఇది బ్రాహ్మణ మశీదు అని అన్నారు. చివరకు అల్లా మాలిక్హై అన్నారు. అంటే ఏమిటి? ఈ విశ్వంలో కులాలు, మతాలు లేవని విశ్వమంతా ఒకే కుటుంబమని ఆ విశ్వపూజితదైవము(Universal

God) చాటి చెప్పారు. మనము ఎవరిని పూజించినా తనని పూజించినట్లేనని, అది తనకే చెందుతుందని ఎన్నో లీలల ద్వారా మనకు తెలియచేసారు. దైవము ఒక్కడేనని నిర్ధారించారు.

*అభయప్రదానము :*


ఇది బాబా మనకిచ్చిన అభయ ప్రదానము. బాబా, "లక్షలాది మందిని చివరంటా గమ్యం చేరుస్తాను" అన్నారు.

భగవద్గీతలో "మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్త్వతః" అని కృష్ణుడు చెప్పినాడు. అంటే వేలమందిలో ఏ ఒక్కడో యోగసిద్ధికోసం ప్రయత్నిస్తాడు. అలా ప్రయత్నించి తెలుసుకొన్న సాధకులలో కూడా ఏ ఒక్కడో నన్ను చేరుకుంటాడు. ఇది భగవద్గీతా వాక్యం.

కాని బాబా లక్షలాది మందిని చివరకంటా గమ్యం చేరుస్తానన్నారు. ఇటువంటి అభయ ప్రదానము ప్రపంచ ఆధ్యాత్మిక సంప్రదాయాలలో ఎవరైనా ఇచ్చారా?

*శుభ్ర మార్గము:*

"నా భక్తుణ్ణి ఎన్నడూ పతనం కానివ్వను" అన్నారు శ్రీసాయిబాబా. బాబా ఎల్లప్పుడు తన భక్తుడిని ఈ సంసార సాగరంలో ఎదురయ్యే అనేక కష్టాలు, నష్టాలనుంచి కాపాడుతూ, అనేక ప్రమాదకర విషయాల నుంచి రక్షిస్తూ, మనం దారి తప్పకుండా గమ్యం చేరేలా చూస్తారు. శుభ్రమార్గాన మనం పయనించటం అంటే బాబా నిర్దేశించిన మార్గములో మనము నడవటమే. అదే మనకు శుభ్రమార్గము.




22.5.2000 ~ సాయినాథుని సత్సంగి

## గురుకృప చదివాను - గురుకృపను చవిచూచాను

నేను, జనవరి, 14వ తేదీన, 2000 సం|| శరత్‌బాబూజీగారు సాయిబాబా విగ్రహ ప్రతిష్టాపన కొరకు బోధన్ వస్తున్నారని తెలుసుకొని వెళ్ళాను. అంతకు ముందు శరత్‌బాబుజీ గారి గురించి నాకు తెలియదు. నా స్నేహితురాలు శైలశ్రీ (బోధన్) ద్వారా తెలుసుకున్నాను. బాబూజీ గారిపై మా స్నేహితురాలికి చాలా నమ్మకము. వారి గురించి పెద్దగా శ్రద్ధలేకపోయినా ఒక మహాత్ముని దర్శనం అవుతుందని మా స్నేహితురాలి బలవంతంపై

వెళ్ళాను. బోధన్‌లో 12 గం||ల వరకు ఉండి బాబూజీ గారు వెళ్ళిపోతారని మా స్నేహితురాలు చెప్పింది. నేను నిజామాబాదు నుండి వెళ్ళాను. బస్సు తొందరగా దొరకలేదు. బస్సు దొరికిన తరువాత మధ్యలో R.T.O. వాళ్ళ చెకింగ్ అయ్యింది. నేను బాబూజీగారిని చూడగలనోలేదో, ఆ సాయినాథ కృప ఉంటే తప్పకుండా చూడగలుగుతానని అనుకున్నాను. సరిగ్గా 10 ని. తక్కువ 12 గం.లకు బోధన్‌కు చేరుకున్నా నేను, నా ఇంకొక స్నేహితురాలు ఇద్దరం చేరుకున్నాము. ఆటోలో గుడి దగ్గరికి వెళ్ళేసరికి బ్యాండుమేళం, ఒక కారు, వస్తుండడం, విపరీతంగా జనం కారుకు అడ్డంగా పరుగెత్తడం, పోలీసులు వారిని లాగడం కనిపించింది. శరత్ బాబూజీగారు వెళ్ళిపోతున్నారని జనం అంటున్నారు. ఈ జనంలో అందులో కారులో నుండి శరత్ బాబూజీగారి దర్శనం అవుతుందో, లేదోనని సంకోచంగా బాధతో నేను, నా స్నేహితురాలు ఆ జనం మధ్యలో, కారు వచ్చే దారిలో నిలుచున్నాము. ఇంతలో కారు మా దగ్గరగా వచ్చింది. జనం మమ్మల్ని తోసేస్తున్నారు. అంతలో ఒక పోలీసు ఆ జనాల్ని పక్కకి తోసి మమ్మల్ని, మీరు దర్శనం చేసుకోండమ్మ అంటూ ముందుకు తీసుకెళ్ళాడు. ఇక మా ఆనందం వర్ణనాతీతము. కారులో ముఖం లోనికి పెట్టి శరత్ బాబూజీ దగ్గరగా చూసాను. ఒక నిమిషం వళ్ళంతా గగుర్పాటు నిజంగా ఆ సాయినాథుడే వచ్చాడన్నంత ఆనందము. బాబూజీ నా ముఖంలోకి చూస్తూ ఆశీర్వదించాడు. అసలు అది కలయా, నిజమా అనిపించింది. ఆ తన్మయత్వంలోనే కారు వెళ్ళిపోయింది కూడ గమనించలేనంత ఆనందము. ఇలా సాయినాథ కృప వల్ల బాబూజీగారి దర్శనముయింది. తరువాత సాయినాథుని దర్శనం చేసుకున్నాము. దర్శనం తరువాత అక్కడ వెలసిన దుకాణం నుండీ ఇంటికి వచ్చిన తరువాత "గురుకృప" పత్రిక చదివాను. ఆ "గురుకృప"లో గురూజీ లీలలను, భక్తుల అనుభవాలను చదువుతుండగా సన్నగా నాకు మెడ దగ్గర నొప్పి ప్రారంభ అయింది. మెడ దగ్గర వెన్నులో నుండి నొప్పి నాకు చాలా రోజులుగా దాదాపు ఒక సం|| కాలం నుండి ఉంది. నేను ఒక ఉపాధ్యాయురాలిని. బోర్డుపై ఒక లైను వ్రాసినా నొప్పి అనిపించి వ్రాయలేకపోయేదాన్ని. డాక్టరుకు చూపించుకుంటే ఏం చెప్తారోనని భయం. అందుకే సాయినాథునిపై భారం వేసి ఎప్పుడయినా విభూతి రాసేదాన్ని. "గురుకృప" పుస్తకం చదివేటప్పుడు కూడా అలానే నొప్పి ప్రారంభముయింది. భక్తుల అనుభవాలు చదువుతూ, నాకు కూడా ఈ పుస్తకం చదివేలోగా ఈ నొప్పి తగ్గిపోతే నేను కూడ"గురుకృప" సంచికకు నా అనుభవాన్ని రాసి పంపుతాను అని మనసులో అనుకున్నాను. ఆ బాధతోనే ఆ పుస్తకం చిన్నదయినా భరించలేనంత నొప్పితో మెల్లిమెల్లిగా చదివాను. నిజంగా ఆ సాయినాథుని దయవల్ల, శరత్బాబూజీ గారి దయవల్ల నాకు నొప్పి క్రమంగా తగ్గిపోయింది. నేను చదివినది 9వ సంచిక, శరత్ బాబూజీ గారిపై భక్తి ఏర్పడింది. అంతకు ముందు నన్ను భయపెట్టిన రోగం నా దరిదాపుల్లోకి రావటం లేదు. ఇప్పుడు బోర్డుపై వ్రాస్తున్నా నొప్పిలేదు. ఇలాంటి నొప్పే మా ఫ్రెండు ఆసుపత్రిలో చూపించుకుంటే బొక్కలు అరిగిపోయాయి అని చెప్పారట. ఇలాంటిదాన్ని సాయినాథుడు, శరత్బాబూజీ గారి ఆశీస్సులవల్ల నాకొచ్చిన బాధ, వ్యాధి ఇలా తగ్గిపోయింది. సాయినాథునికి, శరత్ బాబూజీగారికి నా కృతజ్ఞతలు.

16.3.2000

~ పి. ఇందిర సుధాకర్

## WITHOUT GURUJI WE CAN'T ACHIEVE

నా పేరు సుష్మ. మాది విజయవాడ. నేను బి.కాం మరియు కంపెనీ సెక్రటరీ కోర్సు చదువుతున్నాను. నాకు గురూజీ బి.కాం.కి సంబంధించి మరియు Company Secretaryకి సంబంధించి మంచి అనుభవములను ప్రసాదించారు. నేను 99 గురుపౌర్ణమికి వెళ్ళినపుడూ నా ఫ్రెండ్ వాసంతి గురూజీని కంపెనీ సెక్రటరీ కోర్సు గురించి అడిగేటప్పుడు బి.కాం సెకండ్ ఇయర్ గురించి కూడా అడగమంది. కానీ నేను బి.కాం యే కదా ఎట్లాగయినా మంచి మార్కులు వస్తాయి కదా అని అడగలేదు. ఆ సంవత్సరం అంటే బి.కాం. సెకండ్ ఇయర్ సెకండ్ క్లాస్ వచ్చింది. నిజంగా నేను ఆ ఇయర్ ఎగ్జామ్స్ చాలా బాగా రాసాను. నేను except చేసిన మార్కులు రాలేదు. ఎందువలన అంటే గురువుగారు ఆశీస్సులు లేవు. మళ్ళీ నేను 2000 ఫిబ్రవరిలో వెళ్ళినపుడు C.S. గురించి

అడగడంతోపాటు నా బి.కాం. ఫైనల్ ఇయర్లో 80% రావాలి అని అడిగాను. వచ్చినాయి, నాకు 81.6% వచ్చింది. అంటే 600కి 490 మార్కులు వచ్చాయి.

నాకు గురూజీ C.S. అంటే కంపెనీ సెక్రటరీ కోర్సుకి సంబంధించి ఇంకో మంచి అనుభవం యిచ్చారు. నేను 98 దసరాకి వెళ్ళినపుడు గురువుగారు బయట సత్సంగం స్టేజి మీద పాదదర్శనం యిచ్చారు. అప్పుడు C.S. గురించి సరిగ్గా అడగలేకపోయాను. జూన్, 99లో C.S. 1st group attempt యిచ్చాను. కానీ ఫెయిల్ అయ్యాను. ఆ తరువాత 99 గురుపౌర్ణమికి వెళ్ళినపుడు నేను గురూజీని యిట్లా అడిగాను. నన్ను C.S. IInd group Decemberలో రాయమంటారా లేదా" అప్పుడు గురూజీ రాయి అన్నారు. మరి ఫెయిల్ అయిన 1st Group రాయనా అని అడిగాను" అది కూడా రాయి అని అన్నారు. మళ్ళీ గురూజీని ఇట్లు అడిగాను. నేను ఈసారి డిసెంబర్ లో ఎటెంప్ట్ యిస్తే తప్పకుండా పాస్ చేయించే బాధ్యత మీదే అన్నాను. డిసెంబర్ లో C.S. IInd group రాశాను. ఈసారి పాస్ అయ్యాను. Nearly 600 members attempt చేస్తే విజయవాడలో 12 మంది పాస్ అయ్యారు. మా ఇనిస్టిట్యూట్ నుండి ఇద్దరు పాస్ అయ్యారు. అందులో నేను ఒకదానిని "అదీ కేవలం గురూజీ కృప వలనే"

ఈ అనుభవం వలన నాకు ఏమి తెలిసిందంటే "Without Guruji's blessings we can't achieve anything, eventhough our maximum contribution towards hardwork is made"

22.6.2000, విజయవడ ~ సి.హెచ్. సుష్మ

## గురుదర్శనం నా జీవితానికి ఒక మలుపు

సద్గురు శ్రీ సాయినాథుని శరత్ బాబూజీ గురించి మొదటిసారి నేను 23, డిసెంబర్, 1999న ప్రొఫెసర్ జి.లక్ష్మీనారాయణగారి ద్వారా విన్నాను. మా వారు వృత్తి రీత్యా 28 సం||లు నార్త్‌లో వుండి కొద్ది నెలల క్రితమే హైదరాబాద్ కు షిఫ్ట్ అయ్యాము.

ఒకరోజు పనివుండి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి వెళ్లాను. అప్పుడు లక్ష్మీనారాయణగారు, తెనాలి నుంచి డా|| S. సాయివరప్రసాదుగారు రాసిన లెటర్ చదువుతున్నారు. ఆయన నాతో గురూజీ గురించి, ఆయనతో తన అనుభవాల గురించి చెప్పారు. నాకు వెంటనే గురూజీ దర్శనం చేసుకోవాలనిపించింది. అదే మాట ఆయనతో అన్నాను. ఆ గురువే దయ చూపారా అన్నట్లు లక్ష్మీనారాయణగారి సహాయ సహకారాలతో డిసెంబరు 30కి షిరిడీ చేరుకున్నాము. 30 సాయంత్రం సత్సంగం హాలులో డయాస్ మీదికి వచ్చి కూర్చొన్న గురూజీని చూశాను. ఆయన దర్శనం కాగానే, నాలో చెప్పలేని ఆనందంతో పాటు ఏదో చెప్పలేని ఉద్విగ్నత కలిగింది. ఎన్నాళ్ళ బట్టో నేను వెతుక్కొంటున్న గమ్యం, గురువు, సాయినాథుని శరత్ బాబూజీయే అనిపించింది.

ఊహించని రీతిలో 1 జనవరి, 2000న గురువుగారి చరణస్పర్శ లభించింది. 15న బోధన్ లో ఆయన దర్శనం, కరస్పర్శ లభించింది. ఆ క్షణం నుంచి నాకు ఇక్కడ వుండకూడదు, షిరిడి వెళ్ళిపోవాలి అని ఒక దృఢమైన కోరిక మొదలయింది. అది క్రమక్రమంగా బలపడసాగింది. దానికితోడు బోధన్ నుండి వచ్చాక నాలో కలిగిన వింత అనుభవాలు నన్ను నిలువనీయలేదు. ఎలాగయినా గురూజీని కలవాలని, ఒక్కసారి మాట్లాడాలని ఎంతగానో అనిపించింది.

ఈ మనోఘర్షణని తట్టుకోలేక జనవరి 29 బయలుదేరి షిరిడీ వెళ్ళాను. గురూజీ అనే అయస్కాంతాకర్షణకి లోనయిన ఇనుప ముక్క అయింది నా మనసు.

30వ తారీఖున బాబూజీ పర్సనల్ ఇంటర్వ్యూ దొరుకుతుందేమోనని ఆశపడ్డాను. సాధ్యం కాలేదు. చెప్పలేని మనోవేదన పొందాను. అలాగే సాయిబాబా గుడికి వెళ్ళాను. దర్శనానికై సాయంత్రం సత్సంగానికి వచ్చి భజనలో పాల్గొన్నాను. గురూజీ వచ్చి డయాస్ మీద కూర్చున్నారు. ఆయన దర్శన భాగ్యం కలిగింది. గురూజీతో ఒకే ఒక్కసారి మాట్లాడాలన్న కోరిక మనసులో ముల్లులా గుచ్చుకుంటుంది. అలా పగలల్లా సాయిమందిరంలో, సాయంత్రం సత్సంగంలో 3రోజులు గడిపాను. గురూజీ దర్శనం లభిస్తోంది. తృప్తిగా వుంది. కాని నా అనుభవాలు గురూజీతో చెప్పుకోవాలి. ఈ తీరని కోరిక నన్ను పిచ్చిదానిని చేస్తోంది. 4వ రోజు సాయంత్రం షుమారు 4.30 గం. ప్రాంతంలో వ్యాకుల మనస్సుతో సత్సంగం హాలుకు వెళ్ళాను. మరునాడే నేను తిరిగి హైదరాబాద్ వెళ్ళాలి. ఈ రోజునాకు పర్సనల్ ఇంటర్వ్యూ దొరక్కపోతే నా కోరిక మరెన్నాళ్ళకు తీరుతుందో ఈ రోజు వారి దర్శనం, ఇంటర్వ్యూ దొరకాలని నాలో నేను మూగబాధను అనుభవిస్తున్నాను. మాటి మాటికి కన్నీళ్ళు తిరుగుతున్నాయి. నేను అక్కడికి చేరేసరికి ఒక పెద్దాయన 55 ఏళ్ళు వుండవచ్చు. అక్కడ కూర్చొని వున్నారు. నేను ఒక ప్రక్కగా దీనంగా "బాబా" ఫోటోవైపు చూస్తూ ప్రార్థిస్తున్నాను.

కాసేపటికి ఆ పెద్దమనిషి వచ్చి నా దగ్గరగా కూర్చున్నారు. ఇప్పుడు నేను ఆయనకు, నాకు జరిగిన సంభాషణ యథాతథంగా రాస్తున్నాను. ఎందుకంటే ఇది "గురూజీ" నాతో పరోక్షంగా మాట్లాడి, నా మనోవేదనని పోగొట్టి, జ్ఞానోదయం కలిగించారని ప్రగాఢంగా నమ్ముతున్నాను. కాబట్టి.

ప్ర. ఏ వూరు నుంది వచ్చావు?

జ. హైదరాబాద్ నుండి.



ప్ర. గురూజీ దర్శనానికి వచ్చావా?

జ. అవును. ఆయనతో ఒక్కసారి మాట్లాడాలన్న కోరికతో.

ప్ర. నీ కోరిక తీరిందా?

జ. దర్శనం దొరికింది. మాట్లాడలేదు.

ప్ర. బాబా దర్శనం చేసుకున్నావా?

జ. చేసుకున్నాను.

ప్ర. గురుస్థానంలో కూర్చుని వచ్చేపోయే సాయిభక్తుల్ని చూశావా?

జ. అవును. అక్కడ కూర్చుంటే చాలా బాగుంది.

ప్ర. ద్వారకామాయిలో కూర్చుని ధ్యానం చేసుకున్నావా?

జ. అవును. ధ్యానంలో చాలా మంచి వైబ్రేషన్స్ వచ్చాయి. ఒక 5 ని. ఏమీ మాట్లాడలేదు. తరువాత.

ప్ర. నువ్వు ఇక్కడకొచ్చి 4 రోజుల్లో ఎన్నిసార్లు గురూజీని చూశావు. ఎన్నిసార్లు బాబాని చూశావు?

జ. నాలుగుసార్లు గురూజీని, 6 సార్లు బాబాని చూశాను.

ప్ర. దీనినిబట్టి నీకేమనిపిస్తోంది?

జ. నాకేమీ తెలియట్లేదు.

ఆయన నాతో, గురూజీ అనే ఆకర్షణ నిన్ను షిరిడీ రప్పించి, దర్శనం ఇచ్చింది బాబాయే అని ఎందుకనుకోకూడదు? గురూజీ దర్శనం చేసుకోవాలి. ఆయనతో మాట్లాడాలనే బలీయమైన కోరికతో నువ్వు ఇక్కడికి వచ్చావు. కానీ నీకీ "గురువు" అనే ఆకర్షనాశక్తినిచ్చింది బాబానే. నీ గమ్యం బాబాని చేరడం. ఆ గమ్యం వైపు నిన్ని నడిపించేశక్తి గురువు. నీ భవిష్యత్తు గురూజీకి అప్పగించు. ఆయన మాట్లాడలేదని బాధపడకు. ఆయన ఎప్పుడూ నిన్ను ఆదుకొంటూనే వుంటారు.

ఆయన మాటలు విన్న నా మనస్సు చాలా హాయిగా, తేలికగా అయింది. అంతకముందు నేననుభవించిన బాధ ఎవరో చేతితో తీసేసినట్టయింది. నెమ్మదిగా కళ్ళుమూసుకొని ధ్యానంలోకి జారిపోయాను. షుమారు ఒక 30 ని.లు తరువాత కళ్ళు తెరిచే సరికి, ఆ హాలులో ఎవ్వరూ లేరు. నేను ఒక్కదానినే ఉన్నాను. అంతసేపు ఆయనతో మాట్లాడినాను. ఆయన ఎవరో, పేరేమిటో అడగలేని నన్ను నేను తిట్టుకున్నాను.

నేను మనస్ఫూర్తిగా నమ్ముతున్నాను. నా ఈ అనుభవం గురూజీ ప్రసాదించిందే. నా గమ్యం ఏమిటో చెప్పారు. ఆయన బాబా వద్దకు నన్ను అడుగడుగునా ఆదుకుంటూ, సంస్కరిస్తూ తీసుకువెళ్లే మహత్తరశక్తి సద్గురు శ్రీసాయినాథుని శరత్ బాబూజీ అని నేను మనస్ఫూర్తిగా నమ్ముతున్నాను.

17-2-2000, హైదరాబాద్ ~ శ్రీమతి జి. సంధ్యారాణి.

## సద్గురుతత్వానికి ఆకారం శ్రీ శరద్బాబూజీ!

సద్గురువులు పరమాత్మని ప్రియపుత్రులు భగవంతుడు తమ శక్తినంతా వీరికి ధారపోసి తమ ప్రతిరూపాలుగా మలచి ఈ లోకానికి ప్రత్యేక కార్యార్థమై పంపుతారు. మరో మాటలలో "సంభవామి యుగేయుగే" అని గీతలో చెప్పినట్లు, భగవంతుడే మానవజన్మ ఎత్తి సద్గురువు రూపంలో ఈ లోకంలో అవతరిస్తారు. అందుకే మనం గురువును బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులేకాక ఆ పరబ్రహ్మ స్వరూపంగా భావించి స్తోత్రం చేస్తాం. "గురువే అన్ని దైవాలు!" అని శ్రీ సాయిబాబా చెప్పింది అందుకే. సద్గురువులు వారి కృపాకటాక్షాలతో శోకతప్తులైన మానవాళిని ఈ భవసాగరం నుండి తరింపచేసి శాశ్వత జీవనాన్ని ప్రసాదించబడటమే వారి ఏకైక లక్ష్యం. మానవులను ఉద్ధరించడం తప్ప మరే పని వీరికుండదు. "అనుగ్రహించడమే నా పని!" (My business is to give blessings) అని బాబా చెప్పిన దానికర్థమదే!

సద్గురువులెప్పుడూ కొత్త మతాన్ని గానీ, సంఘాన్ని కానీ ఏర్పాటు చెయ్యరు. కర్మకాండల పట్లను, మతపరమైన సాంప్రదాయాల పట్లను వీరికి అభిరుచి ఉండదు. హంగులు, ఆడంబరాలంటే వీరికి గిట్టదు. సన్మానాలు, పూర్ణకుంభ స్వాగతాలు, పాదపూజలు భిక్షలనబడే విందు భోజనాలు (బ్రష్టభిక్ష) అసలే గిట్టదు. వీరికి కీర్తి ప్రతిష్టలనిన అభిలాష ఉండదు. వీరు మనలాగా సాధారణంగా కన్పిస్తారు తప్ప ప్రత్యేకమైన వేషభాషలుండవు. కాషాయంబరాలు ధరించరు. మతరపమైన బాహ్య చిహ్నాలేమీ ఉండవు. వీరెప్పుడూ సరళమైన ప్రజలు మాట్లాడే వాడుక భాషలోనే మాట్లాడుతూ, వారు జన్మించిన మతాల్లోనూ, సంఘాల్లోనూ వుంటూ భగవంతునన్వేషించమని ఉద్బోధిస్తారు. ఎలాంటి కర్మకాండలు చేయమనిగానీ, ప్రత్యేకమైన దుస్తులు ధరించమనిగానీ, ప్రత్యేకమైన జీవన విధానాన్ని పాటించమనిగాని చెప్పరు. ఈ ప్రపంచాన్ని త్యజించమని, సన్యసించి ఒంటరిగా తపస్సు చేసుకోమని కూడా చెప్పరు. ఈ ప్రపంచంలోనే జీవిస్తూ, గృహస్థ జీవనాన్ని గడుపుతూ తమ విద్యుక్త ధర్మాన్ని నెరవేరుస్తూనే భగవంతుని సన్నిధికి చేరుకోడానికి మార్గాలు అన్వేషించాలని తెలియచేస్తారు.

సద్గురువులెన్నడు ఎవ్వరి నుండి ఒక్క పైసా కూడా పరిగ్రహించరు. అలా కాక ఎవ్వరినుండైనా ధన వస్తు రూపేణా ఏదైనా స్వీకరిస్తే అతడు భిక్షగాడవుతాడే తప్ప సద్గురువు కాలేడు. సద్గురువులు ఈ లోకానికి వచ్చింది దాతలుగా ఇవ్వడానికి మాత్రమే కానీ తీసికోడానికి కాదు. వారెప్పుడు తమ జీవితావసరాలకు అతిథి సత్కారాలకు స్వార్జితంపైనే ఆధారపడతారు. సద్గురువుల జీవిత చరిత్రలు చదివితే మనకది బోధపడుతుంది. సంతకబీరు రాజులను రారాజులను శిష్యులుగా కలిగి వుండి కూడా తన జీవితాంతం గుడ్డలు నేసి జీవించాడు. ఇలానే సంతనామదేవుడు, గురునానక్ కూడా! ఒకరు బట్టలను రంగులద్దేవానిగా మరొకరు కర్షకునిగా జీవించారు.

కమలము నీటిలో నున్నప్పటికి ఏ విధంగా తడవదో అదే విధంగా సద్గురువు ఈ ప్రపంచంలో జీవిస్తున్నప్పటికి అందులో లీనమవ్వకుండా ఉంటారు. ప్రపంచ వాసనలు, మోహబంధాలు వారినంటవు. అహంకారాన్ని దహింపజేసి, అరిషడ్వార్గాలను, ఇంద్రియాలను జయించి నిరాడంబరంగానూ, నిష్కళంకంగానూ జీవిస్తారు.

సద్గురువు భగవంతునివలె సర్వశక్తిమంతుడు, సర్వాంతర్యామి, సర్వజ్ఞుడు, సర్వవ్యాపి మరియు త్రికాలదర్శి. తమ భక్తులను సర్వకాల సర్వావస్థలయందు వారి వెంటే వుండి కాపాడుతారు. తమ భక్తుడు సుదూర క్షేత్రాలలో నున్నా సప్త సముద్రాల ఆవలనున్నా తమను ధ్యానించిన వెంటనే అతనికి దృశ్యరూపమున ప్రత్యక్షమై అతనినాదుకుంటారు. బాబా తమ గురువు విషయమై చెప్పిన విధంగా, తాబేలు సముద్రపుటావలి ఒడ్డునున్న తన పిల్లల్ని ఏ విధంగా కేవలం తన ప్రేమదృక్కులతో కాపాడుతుందో అదే విధంగా గురువు తమ శిష్యులు ఎక్కడున్నా, ఎంత దూరంలో నున్నా తమ మనోనేత్రపు ప్రేమ వీక్షణాలతో వారిని రక్షిస్తూ కాపాడుతారు. సద్గురులెప్పుడు జనులకు ప్రదర్శించడానికి మహిమలు చేయరు. అంతేగాక సద్గురువులెప్పుడూ తాము మహిమలు చేసినట్లుగా ఒప్పుకోరు. తమకేమీ తెలియనట్లుగా నటిస్తూ అన్నీ ఆ భగవంతునికే ఆపాదిస్తారు. ఎప్పుడైతే సద్గురువు ఒకరిని తమ శిష్యునిగా స్వీకరిస్తారో ఆ క్షణమునుండి ఆ శిష్యుని బరువు బాధ్యతలన్నీ వారే తీసుకుంటారు. చేయవలసిందంతా వారే చేసి ఆ శిష్యుని చివరకంటూ గమ్యం చేరుస్తారు. సద్గురువులు తమ శిష్యులను రక్షించడానికి వారి పాపకర్మలన్నీ తమపై వేసుకొని అనుభవిస్తారు. కానీ ఈ విషయం బయటకు పొక్కనివ్వరు. అసలు తాము భగవంతుడనే సత్యాన్ని వెల్లడిచేయకుండా అతి గుప్తంగా ఉంచుతారు. ఈ విషయం తెలిసిన తమ శిష్యులను కూడా వెల్లడి చేయకుండా కట్టుబాట్లు విధిస్తారు. వారెంతటి ప్రేమ స్వరూపులంటే తమ శరణాగతులనుద్ధరించడానికి విధి విధానాన్నే మారుస్తారు.

సద్గురువులకున్న మరో ప్రధాన లక్షణం సమదృష్టి. వీరికి జాతి, మత, కుల విచక్షణ గానీ, పేద, ధనిక బేధంగానీ ఉండదు. వీరికి తరతమభేదమసలే వుండదు. ఆడ, మగ, చిన్నా పెద్ద అన్న తేడాలేవీ చూపక తరతమ భావంతో మెలగుతారు. అందరూ వీరి కన్నబిడ్డలే!

ఇక శిరిడీలో వెలసియున్న శ్రీ సాయినాథుని శరద్బాబూజీగారి ప్రస్తావనకొద్దాం! బాబూజీగారొక అపూర్వ వ్యక్తి. వీరు మనలాగే సామాన్యంగా కన్పిస్తారు తప్ప ప్రత్యేకమైన వేషభాషలుండవు. మతపరమైన బాహ్యచిహ్నాలు అసలే వుండవు. తెల్లటి పంచెను దట్టీగా ధరించి పైనొక బనీను లాంటి చొక్కావేసికొంటారు. భుజంపై నొక తుండుంటుంది. ఇది వారి వేషం! మతపరమైన సాంప్రదాయాలకు, కర్మకాండలకు విలువివ్వరు. వీరికి హంగులన్నా, ఆడంబరాలన్నా గిట్టవు. సన్మానాలు, పూర్ణకుంభ స్వాగతాలు, పాదపూజలపై వీరికి అభిలాష లేదు. వీరు సరళమైన మనం మాట్లాడే భాషలోనే మాట్లాడుతూ తాము జన్మించిన మతాల్లోనే వుంటూ భగవంతునన్వేషించాలని ప్రభోధిస్తారు. ప్రపంచాన్ని త్యజించమనిగానీ, సన్యసించి తపస్సు చేసుకొనమనిగానీ

చెప్పరు. ఈ ప్రపంచంలోనే జీవిస్తూ, గృహస్థ జీవనం గడుపుతూ, ఎవరి విద్యుక్తధర్మాన్ని వారు నెరవేరుస్తూ శ్రీ సాయిసన్నిధికి చేరుకోడానికి మార్గాలు అన్వేషించమని తెలియజేస్తారు.

వీరు ఏనాడూ ఎవ్వరినుండి ఒక్క గుడ్డి పైసా అయినా స్వీకరించి ఎరుగరు. ధనం మీదున్న ధూళి సహితం వీరిని సోకడానికి సాహసించదు. భక్తులు తమకు కానుకగా సమర్పించిన పండ్లు, ఫలహారాలు, ఇతర సామాగ్రి వగైరాలన్నింటిని బాబాకు సమర్పించి, ప్రసాదంగా తిరిగి భక్తులకే పంచుతారు. తప్ప కనీసం వాటిలో ఒక పండయినా స్వీకరించరు. తమ జీవితావసరాలకు, అతిథి సత్కారాలకు తమ స్వార్జితం (ఒంగోలులో తాము స్థాపించిన "సాయిబాబా మిషన్ సెంట్రల్ స్కూలు" నుండి నెలనెలా వచ్చు భృతి) పైనే ఆధారపడతారు. ఆశ్రమంలో నివసిస్తున్నప్పటికి తాము ఉంటున్న చిన్నగదికి బాడుగ కూడా ఆశ్రమ నిర్వాహకులకు చెల్లిస్తారంటే మనం ఆశ్చర్యపోనక్కరలేదు. సద్గురువులు ఈ లోకానికి వచ్చేది దాతలుగా ఇవ్వడానికి గానీ తీసుకోవడానికి కాదనే సూక్తి వీరి విషయంలో పరమ సత్యం. వీరు భక్తులడగగానే ఇవ్వడమే తప్ప తీసుకోవడమన్నది కల్ల. నిరంతరం భక్తులకు అనుగ్రహించడమే వీరిపని. (His business is to give blessings).

బాబూజీ గారు ఈ ప్రపంచంలో జీవిస్తున్నా ప్రపంచపు వాసనలు, మోహ బంధాలు వీరినంటలేదు. అహంకారాన్ని నశింపజేసి, అరిషడ్వర్గాలను, ఇంద్రియాలను జయించి నిరాడంబర, నిర్మల, నిష్కళంక జీవనం గడుపుతున్నారు. సంతానము, ఆరోగ్యము, విద్య సంపదలు, పదవులు మొదలైన వాటినాశించి తమ దగ్గరికి వచ్చిన భక్తుల కోరికలన్నీ నెరవేరుస్తున్నారు. సర్వజ్ఞత ప్రకటిస్తున్నారు. ఎక్కడో ప్రపంచ మూలలలో తమ పటం ముందు కూర్చుని ఆర్తిగా ప్రార్థించిన భక్తుల ఆపదలు తొలగించి, వారి సమస్యలకొక పరిష్కార మార్గం చూపుతున్నారు. వైద్యశాస్త్రంలో అసాధ్యమైనవిగా ప్రకటితమైన కాన్సర్ లాంటి వ్యాధులను కేవలం ఊదీతోనే నయం చేస్తున్నారు. సంతాన ప్రాప్తి లేనివారికి సంతానం ప్రసాదించి విధీకృతాన్నే మార్చుతున్నారు. మూడు సంవత్సరాల నుండి మంచుకురియని సిమ్లా అను నగరంలో తాము అక్కడ గడిపిన రాత్రి మంచుకురిపించి ప్రకృతి శక్తులపై తమ ఆధిపత్యాన్ని నిరూపించారు. ఇలా సాయిశక్తికి సజీవరూపమై ఎన్నో మహిమలు ప్రదర్శిస్తున్నారు.

అంతేగాక వీరు భక్తుల పాపకర్మలన్నీ తమపై వేసికొని అనుభవించి వారిని విముక్తుల్ని చేస్తున్నారు. అందుకే వారు సంవత్సరంలో మూడో భాగం అస్వస్థులై తీవ్ర జ్వరంతో బాధపడుతుంటారు. కానీ ఆ అస్వస్థత భక్తుల కర్మసంచితాల అనుభవ ఫలితమేననే సత్యాన్ని బయటకు పొక్కనివ్వరు. అంతేగాక తాము ప్రదర్శించిన మహిమలు కూడ తమకు తెలియనట్లుగా నటించి అన్నీ ఆ సాయియే చేసినట్లుగా వారికే ఆపాదిస్తారు.


వీరి సమతా దృష్టి అపూర్వం. వీరికి అందరూ సమానమే. జాతి, మతముల విచక్షణగానీ, పేద ధనిక బేధం గానీ లేక అందరిని సమానంగా చూస్తారు. ఇక్కడ చిన్న - పెద్ద, ఆడ - మగ తేడాలుండవు. తన పరబేధాలసలే వుండవు. తమను దర్శింప వచ్చిన వారెవరైనా సరే - దేశాన్ని పరిపాలించే పాలకులే కావొచ్చు. కోట్లకు పడగలెత్తిన కుబేరులే కావొచ్చు. కూటికి గతిలేని పరమ దరిద్రులే కావచ్చు. అందరూ ఒకే క్యూలో వెళ్ళి వారిని దర్శించవలసినదే! ఎలాంటి ప్రత్యేకతలు చూపబడవు. పీడిత జన ఉద్ధారణకే మొదటి ప్రాధాన్యత!

పై కథనాన్ని బట్టి శ్రీ సాయినాథుని శరద్బాబూజీ సద్గురు ధర్మానికే ఆకారమని మనకు తెలుస్తుంది. అందువల్ల పాఠకులారా! సద్గురు శ్రీ సాయినాథుని శరద్బాబూజీగారి వద్ద శరణాగతి పొంది వారి ప్రేమకు పాత్రులై తరించండి. వారి ప్రేమకు పాత్రులవడానికి రెండే రెండు మార్గాలున్నాయి. మొదటిది,నిరంతరం శ్రద్ధ సబూరిలతో శ్రీ సాయినాథుని ఆరాధించడం. శ్రీ సాయినాథుని ప్రేమించడమంటే బాబాజీని ప్రేమించడమే. ఇద్దరూ ఒక్కటే కాబట్టి! ఇక రెండవది, వారు ఎలా ఆజ్ఞాపిస్తే అలా తు.చ తప్పకుండా ఆచరించడం, వారు చెప్పినట్లు నడుచుకోవడం!

8.6.2000, కోవూరు ~ సాయిదాసు

## "నేనెవ్వరికి ఏమీ నేర్పించను నేర్చుకొనేలా చేస్తాను"

గురువుగారి సన్నిధిలో గడుపుతున్నంతసేపు జీవితం మధురమైందని, ధన్యమైందని అనిపిస్తుంది. ఆ కాలం విలువైందని, మళ్ళీ మళ్ళీ అలాంటి రోజులు, రోజూ రావాలనిపిస్తుంది. వాటిని మాటిమాటికి నెమరేసుకున్నప్పుడల్లా, శరీరం రోమాంచితమైపోతుంది. కొన్ని మధురిమలు గుర్తుకొచ్చి, ఆనందాన్ని లక్షింతలు చేసినప్పుడల్లా గురువుగారి నోటి నుంచి వచ్చిన ప్రతి పలుకును మనోఫలకం మీద ముద్రించుకోవాలని ఉంటుంది. అలాంటి సందర్భములలో వచ్చిన వారిలో ప్రభావం ఏ విధంగా ఉంటుందని పరిశీలించితే బాబా మీద అపారమైన ప్రేమ, అవ్యాజమైన శరణాగతి చెందటానికి ఉపస్కారకమైతున్నది. ఇందుకు మూలం గురువుగారి పలుకులే మూలకారణం. ఏకాంతంలో ఉన్నప్పుడు సరిసాటియైన గురుబంధువులభించినప్పుడు ఈ విషయాలను తలపోస్తున్నప్పుడు జరుగుతున్నదేమిటి. మనకుగా మనకు తెలియకుండానే బాబాకు సంబంధించిన విషయాలను మాటిమాటికి మననం చేసుకోవడం జరుగుతున్నది. బాబా తలంపులను ఆలోచింపచేస్తున్నది. మనకుగా మనకు తెలియకుండానే గురువుగారు మనచేత "సాయిభక్తి సాధనము" చేయిస్తున్నారనిపిస్తుంది. ఇది రహస్యంగా కొనసాగుతున్న సాధన, అందరిలోను, వారి ప్రమేయం లేకుండానే గురువుగారు మనందరిచేత బాబాకు సంబంధించిన యాక్టివిటీసి చేయిస్తున్నారు. ఈ సందర్భంతో గురువుగారు కబీరులా కనిపిస్తున్నారు. కబీరు భావానికి తెలుగు సేత.



"ప్రాణాయామయులు, పూజా పురస్కారములు
పలుమారులు చేయమని పల్కు గురువు కన్నా
సహజ సమాధి స్థితికి చేర్చుగురువే మిన్న
భోగములందు యోగము చూపించువారే గురువు"

ఆధ్యాత్మికానుభూతి పొందాలనుకొనే ప్రతిసాధకుణ్ణి, గురువుగారలాగే చేస్తున్నారనిపిస్తున్నది. ఒకానొక సందర్భంలో "నేనెవ్వరికి ఏమీ నేర్పించను నేర్చుకొనేలా చేస్తానని" అన్నారు. వారేం చెప్పినా సరే అది బాబాతో ముడిపడి ఉంటుంది. ప్రారంభంలో ఇదెందుకు చెప్తున్నారో తెలియకున్నా ఆ తరువాత అర్థమైన తరువాత అనుభవించే ఆనందం అంతంతకాదు. బాబాను మనకు ఎన్ని కోణాల్లో చూపుతారో అర్థమౌతుంది. ఇలాంటి సన్నివేశాన్ని 1992లో చూచినదాన్ని గురుబంధువులకు గుర్వాశీర్వచనంతో విశదీకరించు ప్రయత్నం చేస్తాను.

1992 ప్రాంతంలో మా S.V.L.గారు, మా సాయి ప్రసాద్ గారు, మరికొందరు గురుబంధువులతోపాటు, నేను గూడా గురుదేవుల సన్నిధిలో ఉండే మహద్భాగ్యం నాకు లభించింది. రాత్రి 11గం.లైంది. గురువుగారు వివరిస్తున్న అంశాలను ఆనందంగా ఆస్వాదిస్తున్నాను నేను. అంతరంగంలో ఆరాధన తప్ప అన్యమెరుగనివాడను. అంతటి మహదవకాశన్ని నాకు అందించిన గురుదేవులకు నా మనస్సులో నమోవాకములు సమర్పించుకొనినాను. ఉన్నట్లుండి కాళిదాసు మహాకవి మీదికి చర్చ మళ్ళింది. సహజాతి సహజంగా సాగిందా సంఘటన, సదర్భము, సాహిత్యమంటే నాకు ఇష్టం. అందులోను కవికులగురువైన కాళిదాసంటె చెప్పలేనంత ఇష్టం. నాకు ఆనందాన్ని ఇవ్వాలనో, (లేదా) నా తెలివితేటలను గమనించాలనో (లేదా) అందులో లోతైన భావాలను నాకు తెలియజేసినందు వలన భవిష్యత్కాలములో నాకెంతో దోహదకారైతుందనో, రెండు శ్లోకాలను అత్యంత వివరణాత్మకంగా వివరించారు గురువుగారు, మహామహోపాధ్యాయునిలా!

1. "ఓంకార పంజర శుకీ, ఉపనిషదుద్యానకేళికల కంఠీ ఆగమ విపిన వన మయూరీ, ఆర్యాం అంతర్విభాగా...

2. వాగర్థా వివసంపృక్తౌ, వాగర్థః ప్రతిపత్తయే
జగతః పితరా వందే, పార్వతీపరమేశ్వరా;

1. ఓంకారమనెడి పంజరములోని చిలుకవలె ఉపనిషత్తులనబడు ఉద్యానవనములోని రాజహంసవలె, వేదశాస్త్రములనెడి అరణ్యములో సంచరించు నెమలివలె...

2. శబ్దార్థములను, పార్వతీ పరమేశ్వరులతో పోల్చిన కాళిదాసు కవితా వైభవాన్ని విశిష్టంగా వర్ణించారు. అందులోని అర్ధనారీశ్వరతత్త్వాన్ని అమోఘంగా వివరించారు. అన్నింటికంతే అధికంగా ఆకర్షించింది ఆధ్యాత్మికపరంగా, సద్గురుపరంగా, శబ్దార్థాలను అందులోని ఆంతర్యాన్ని, అంతరార్థాన్ని, అంతరంగాన్ని అక్కడున్న మా అందరికి చెప్పారు.

ఈ ఆలోచనాసరళి కాళిదాసులో ఉందా? అని అప్పుడు నాకు అనిపించింది. ఇంకా వివరించాల్సింది ఉందన్నారు గురువుగారు. ఆ విషయాల్ని మీరే అర్థం చేసికోవాలి, గ్రహించుకోవాలన్నారు. అప్పట్లో నాకనిపించిన భావం సరస్వతీదేవి ప్రస్తుతానికి పురుషరూపం ధరించిందానిపించింది. అది ఆనాటి సారస్వత విభావరి.

ఈ రెండు శ్లోకార్థ వివరాలు విన్న తరువాత సంప్రదాయానుసారంగా సాగిన విద్యకు, ఆధ్యాత్మిక మార్గంలో అనుభూతిని, అనుభవాన్ని పొందిన మహనీయుల మాటలకు,ఆత్మసాక్షాత్కారమునొంది దివ్యావతరణమునొందిన దైవస్వరూపుల వాక్యములకు ఎంతటి మహిమగలదో అర్థమైంది. వ్యత్యాసములు గూడా అవగతమైనాయి. అందుకనే మహనీయుల వచనములు వేదము కన్నా మిన్నయైనవి. రఘువంశ ఆరంభ ప్రార్థనా గీతానికి ఆధ్యాత్మికకు, సాధనకు, ఎంతగా ముడిపడి వుందోనన్న విషయం, కాళిదాసు హృదయావిష్కర్షణ చేసి కావ్యజీవితానికి అనువాదార్థాన్ని అందించడమనే అంశం, మహర్షి సత్తమునికే సాధ్యమౌతుంది. "నానృషికురుతే కావ్యం" ఋషికాని వారు కావ్యరచన చేయలేరనే లోకార్థమును పాటించిన రీతిగానే, మహిమోపేతుడు, మహామహోపాధ్యాయుడు, మహనీయుడైన "మహర్షి" మాత్రమే ఋషిపుంగవుని కావ్యహృదయాన్ని అనువాదం చేయగల్గుతారు. గురుదేవులు వివరించిన దానిని మరోసారి చింతన చేయవల్సివచ్చింది నాకు. మరుసటి రోజు ఉదయాన్నే S.V.L. గార్ని అడిగి మరికొన్ని వివరాలు తెల్సుకున్నాను. (నేను ధారణ చేయలేకపోయినవి). (ఆ వివరాలు వచ్చే సంచికలో)

రేపల్లె. ~డా|| S. సాయి వరప్రసద్ రావు